



sahanamvande.com

epaper.sahanamvande.com

# సహానం వందే

హైదరాబాద్ | 15-10-2026 గురువారం | సంపుటి-02 సంచిక : 172 EDITOR: ROHINI





# ఓవర్ ట్రీట్‌మెంట్... ఓవర్ మెడికేషన్

## వైద్య వ్యాపారంలో నలిగిపోతున్న రోగులు




**చిన్న తలనొప్పితో ఆస్పత్రికి వెళ్తే పది రకాల టెస్టులు రాసి, ల్యాబ్ రిపోర్టులతో భయపెట్టి గుప్పెడు మందులు మింగిస్తున్నారు. మన దేశంలో రోగం తగ్గడం కంటే జేబులు, శరీరాలు గుల్ల కావడమే ఎక్కువవుతోంది. డాక్టర్ చంద్రకాంత్ లాహరియా రాసిన 'పిల్-ఫ్రీ' పుస్తకం భారతదేశంలో జరుగుతున్న ఓవర్‌ట్రీట్‌మెంట్, ఓవర్‌మెడికేషన్‌ను బట్టబయలు చేసింది. ఆధునిక వైద్యంలో అత్యాధునిక స్కానింగ్‌లు వచ్చినప్పటికీ, అదే స్థాయిలో పరిమితికి మించిన చికిత్సలు పెరిగాయి.**

**- సహానం వందే, హైదరాబాద్**

- ఫీ-ఫర్-సర్వీస్ వైద్యంలో వ్యాపార ధోరణి
- అవసరం లేని పరీక్షలు, అనవసర మందులు
- స్క్రీనింగ్ పరీక్షల పేరిట ఆసుపత్రుల దోపిడీ
- ఇన్సూరెన్స్ పేరిట అనవసర ఆపరేషన్లు
- స్పెషలిస్టుల వైఖరితో వైద్యం ముక్కలు
- 'పిల్-ఫ్రీ' పుస్తకంలో భయంకర నిజాలు
- ప్రపంచవ్యాప్తంగా 'చూజింగ్ వైజ్లీ' ఉద్యమం

అనవసర వైద్యానికి ప్రధాన కారణం హెల్త్ చెకప్‌ల పేరిట జరిపే స్క్రీనింగ్ పరీక్షలే. నేషనల్ మెడికల్ జర్నల్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం... సాధారణ చెకప్ ప్యాకేజీలలో చేసే అనవసర పరీక్షల వల్ల తప్పుడు పాజిటివ్ రిపోర్టులు వచ్చి రోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దాంతో మరిన్ని ఫాలోఅప్ పరీక్షలు చేయడం, అవసరం లేని చికిత్సలు ప్రారంభించడం ఒక అలవాటుగా మారింది. నిజంగా టెస్ట్ అవసరమా అని ఆలోచించే పరిస్థితి లేకుండా పోయింది.

### ముక్కలై విడిపోతున్న వైద్య విధానం...

వైద్య రంగంలో స్పెషలిస్టులపై అమితంగా ఆధారపడటం మరొక సమస్య. చిన్న అనారోగ్యం వచ్చినా నేరుగా స్పెషలిస్ట్ దగ్గరకే వెళ్తుండటంతో దీర్ఘకాలిక రోగులు వేర్వేరు శరీర భాగాల కోసం వేర్వేరు డాక్టర్లను సంప్రదించాల్సి వస్తోంది. ఆయా వైద్యులు తమ విభాగానికే చికిత్స చేస్తారు తప్ప శరీరం మొత్తాన్ని ఒకేలా పరిగణించరు. దీనివల్ల సమగ్ర చికిత్స అందకుండా వైద్యం ముక్కలవుతోంది.

### వృద్ధులపై పడుతున్న తీవ్ర ప్రభావం

ఈ పరిణామాలు వృద్ధులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. 2021, 2025లలో వచ్చిన అధ్యయనాల ప్రకారం... మన దేశంలో దాదాపు 49 శాతం మంది వృద్ధులు ప్రతిరోజూ ఐదు లేదా అంతకంటే ఎక్కువ రకాల మందులు వాడుతున్నారు. వీరిలో 28 శాతం కేసుల్లో వారికి అనవసరమైన మందులు ఇస్తున్నట్లు తేలింది. కాబట్టి ప్రతీ ఒక్కరూ క్రమం తప్పకుండా తమ మందుల ప్రిస్క్రిప్షన్‌ను డాక్టర్‌తో సమీక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### వ్యాపారమయంగా మారిన హెల్త్ ఇన్సూరెన్స్

వైద్య రంగం వ్యాపారమయంగా మారడంతో లాబొరేటరీ టెస్టులు, స్కానింగ్‌లు, ఆపరేషన్లు వస్తువులుగా మారాయి. ఇన్సూరెన్స్ కంపెనీలు డబ్బులు కడతాయి కదా అని ఆస్పత్రులు భారీ ఖర్చుతో కూడిన వైద్యం చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నాయి. అయితే ఇన్సూరెన్స్ కంపెనీ చెల్లించినా అనవసర చికిత్స వల్ల నష్టపోయేది రోగి శరీరమే అని గ్రహించాలి. వైద్యులలో పెరుగుతున్న భయం, పొరపాటు జరిగే ప్రమాదం ఉందనే ఉద్దేశంతో అదనపు టెస్టులు రాయడానికి కారణమవుతోంది.

### రోగులలో అవగాహన ప్రాముఖ్యత

ఈ సమస్యపై ప్రపంచవ్యాప్తంగా 70 స్పెషాలిటీ సొసైటీలు కలిసి 'చూజింగ్ వైజ్లీ' అనే ఉద్యమాన్ని ప్రారంభించి అనవసర చికిత్సలను గుర్తించాయి. డాక్టర్ వద్దకు వెళ్లినప్పుడు ప్రతి ప్రిస్క్రిప్షన్‌పై సమీక్షించే తేదీ, మందులు ఎప్పుడు ఆపాలో స్పష్టంగా రాయించుకోవాలి. రోగి కూడా ఏ చికిత్సకైనా ముందే ఈ టెస్ట్ ఎందుకు అవసరం, లాభనష్టాలు ఏమిటి, ప్రత్యామ్నాయాలు ఉన్నాయా అని ప్రశ్నించాలి. ఏది అవసరమో తెలుసుకోవడమే నిజమైన అవగాహన.




# లక్ష రూపాయల మందు బాటిల్

## తెలంగాణలో ఇదే ఖరీదైన డ్రింక్

**మద్యం బాటిల్ ధర మహా అయితే ఎంత ఉంటుంది చెప్పండి? ఓ ఐదు వేలా, పది వేలా? బాబూ.. మీరు ఇంకా అక్కడే ఉన్నారా? కాస్త ఈ లోకంలోకి రండి. కేవలం ఒక్క బాటిల్ మందు ధర అక్షరాలా లక్షా పదహారు వేల రూపాయలు! వింటేనే గుండె గుభేల్ మంటోంది కదూ! దసరా పండుగ వేళ తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన విదేశీ మద్యం సవరించిన ధరల జాబితా చూస్తే ఇలాంటి షాకులు ఎన్నో తగులుతాయి. అసలు ఆ అత్యంత ఖరీదైన డ్రింక్ ఏంటి, మిగతా బ్రాండ్ల పరిస్థితి ఏంటో ఇప్పుడు చూద్దాం.**

**- సహానం వందే, హైదరాబాద్**

- రాష్ట్రంలో భారీగా పెరిగిన లిక్కర్ ధరలు




తెలంగాణలో విదేశీ మద్యం బ్రాండ్ల సవరించిన ధరల జాబితా తాజాగా విడుదలైంది. సోమవారం నుంచి అమల్లోకి వచ్చిన ఈ జాబితాలో స్కాచ్, సింగిల్ మాల్ట్, జపనీస్ విస్కీలతో పాటు ప్రపంచ ప్రసిద్ధి చెందిన లగ్జరీ వైన్లు, షాంపైన్ల కొత్త ధరలను ప్రకటించారు. ఇందులో కొన్ని బ్రాండ్ల ధరలు సాధారణ ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. ఈ జాబితా మొత్తంలో అన్నింటికంటే ప్రధానంగా హైలైట్ అవుతున్నది 'డామ్ పెరిగ్నాన్ రోజ్ షాంపైన్'. 750 ఎంఎల్ పరిమాణం కలిగిన ఈ బాటిల్ డ్యూటీ పెయిడ్ ధర ఏకంగా 1,16,560రూపాయలుగా నమోదైంది.దీంతో ఇది తెలంగాణ మార్కెట్లో అత్యంత ఖరీదైన డ్రింక్‌గా రికార్డు సృష్టించింది.

### గ్లెన్‌మొరాంజీ సిగ్నెట్ విస్కీ ధర 50,660

ఇక గ్లెన్‌మొరాంజీ బ్రాండ్‌లోనే అత్యంత ఖరీదైన 'గ్లెన్‌మొరాంజీ సిగ్నెట్' హైల్యాండ్ సింగిల్ మాల్ట్ విస్కీ ధర రూ. 50,660గా ఉంది. అలాగే మోయెట్ అండ్ చాండన్ ఐస్ షాంపైన్ ధర రూ. 18,870 ఉండగా, బ్రూట్ ఇంపీరియల్ షాంపైన్ రూ. 14,270గా ప్రకటించారు. అంతేకాదు, ఇతర ప్రీమియం విస్కీల ధరలు కూడా భారీగానే ఉన్నాయి. ప్రముఖ గ్లెన్‌మొరాంజీ 18 ఏళ్ల హైల్యాండ్ సింగిల్ మాల్ట్ స్కాచ్ విస్కీ ధర రూ. 27,270 కాగా, రాయల్ సెల్యూట్ 21 ఏళ్ల విస్కీ ధర రూ. 27,220 ఉంది. ఇక చీవాస్ రీగల్ 12 ఇయర్స్ విస్కీ రూ. 4,940 ఉండగా, 18 ఏళ్ల వెర్షన్ ధర రూ. 10,540 గా ఉంది.

### హిబికి జపనీస్ హార్మొనీ...

జపనీస్ విస్కీల విషయానికి వస్తే, హిబికి జపనీస్ హార్మొనీ, యమజాకి డిస్టిలర్స్ రిజర్వ్ సింగిల్ మాల్ట్ విస్కీలు రెండూ కూడా దాదాపు రూ. 17,400 నుండి రూ. 17,450 వరకు ధర కలిగి ఉన్నాయి. జపాన్ నుంచి దిగుమతి అయ్యే ఈ ప్రత్యేకమైన బ్రాండ్లకు ఉన్న డిమాండ్ దృష్ట్యా ఈ రేట్లు ఫిక్స్ చేశారు. మరికొన్ని ప్రముఖ బ్రాండ్లను పరిశీలిస్తే, గ్లెన్‌ఫిడిచ్ 12 ఏళ్ల సింగిల్ మాల్ట్ రూ. 7,910 కాగా, 15 ఏళ్ల బాటిల్ ధర రూ. 10,510 ఉంది. అలాగే గ్లెన్ గ్రాంట్ 18 ఇయర్స్ సింగిల్ మాల్ట్ ధర రూ. 13,420 గా నిర్ణయించారు. లగ్జరీ డ్రింక్స్ ప్రియులను టార్గెట్ చేస్తూ ఈ ధరలను సవరించినట్లు స్పష్టమవుతోంది. రష్యన్ బెలుగా నోబుల్ వోడ్కా ధర రూ. 5,810 ఉండగా, గ్రే గూస్ వోడ్కా రూ. 5,050 గా ఉంది. అలాగే రోకు జిన్ ధర రూ. 7,620గా పేర్కొన్నారు.

# ఆధ్యాత్మిక వల... మహిళ గిలగిల

## చాటింగ్‌లతో కాపురం కూల్చిన గురూజీ

- సుద్దులు చెబుతూ గృహిణితో ప్రేమాయణం
- భర్త ఫిర్యాదుతో వెలుగులోకి వ్యవహారం
- హైదరాబాదులో చైతన్య గురూజీ లీలలు



**భక్తి పేరుతో దగ్గరై, నమ్మిన వారి జీవితాల్లో నిప్పులు పోసే వాళ్లను మనం ఏమనాలి? ఆధ్యాత్మిక గురువు అంటే జీవితానికి సరైన దారి చూపించాలి, కానీ కొందరు చేసే పనులు చూస్తే సమాజం ఎటుపోతోందో అర్థం కావడం లేదు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా ఎంతో సంతోషంగా సాగుతున్న ఒక కుటుంబంలో ఒక గురూజీ ఎలాంటి కలకలం రేపాడో, ఎలాంటి చీకటి కోణాన్ని బయటపెట్టాడో తెలుసుకుందాం. శ్రీ చైతన్య గురూజీ అనే ప్రబుద్ధుడిపై సంచలన ఆరోపణలు రావడమే కాకుండా పోలీస్ కేస్ కూడా నమోదైంది. కష్టాల్లో ఉన్నప్పుడు దారి చూపిస్తారని నమ్మిన ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ భార్యను ఈ గురూజీ తన మాయమాటలతో వలలో వేసుకున్నాడు. - సహానం వందే, హైదరాబాద్**

హైదరాబాదులో ఆధ్యాత్మిక సందేశాలు ఇచ్చే పేరుతో మొదలైన పరిచయం రానురాను వ్యక్తిగత చాటింగ్‌ల వరకు వెళ్ళింది. చివరకు ఆ మహిళను తన వైపు తిప్పుకుని ఒక సంసారాన్ని రోడ్డున పడేసేలా చేశాడు. ఈ విషయం తెలిసిన బాధిత భర్త ధైర్యంగా ముందుకు వచ్చి పోలీసులను ఆశ్రయించడంతో ఈ రచ్చ బయటపడింది. సదరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తన భార్య ప్రవర్తనలో మార్పు రావడం గమనించి అనుమానంతో ఆరా తీశాడు. ఆమె ఫోన్ చూడగా అందులో శ్రీ చైతన్య గురూజీతో చేసిన పర్సనల్ చాటింగ్‌లు బయటపడ్డాయి. ఆ సంభాషణలు మామూలు భక్తి భావంతో కూడుకున్నవి కావు, అత్యంత వ్యక్తిగతమైన విషయాలు మాట్లాడినట్లు తేలింది. గురూజీ తన మాయమాటలతో ఆమె మనసును పూర్తిగా మార్చేశాడని భర్త ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. భార్యను సంసారానికి కాకుండా చేసి తమ దాంపత్య జీవితాన్ని నాశనం చేశాడని అతను ఆరోపిస్తున్నాడు.

### మాయమాటలతో మహిళకు విసిరిన వల

పోలీసులు కేసు నమోదు చేసి ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ ప్రారంభించారు. ఆధ్యాత్మిక గురువులు అని నమ్మి ఇళ్లకు పిలిపించుకోవడం లేదా వారితో అతిగా చాటింగ్ చేయడం ఎలాంటి ప్రమాదాలకు దారితీస్తుందో ఈ ఘటన మరోసారి నిరూపించింది. మానసిక ప్రశాంతత కోసం గురువుల వద్దకు వెళ్లే అమాయక మహిళలను లక్ష్యంగా చేసుకుని కొందరు ఇలాంటి వలలు విసురుతున్నారు. భక్తి పేరుతో జరుగుతున్న ఈ మానసిక దోపిడీపై ఇప్పుడు స్థానికంగా పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. బాధితుడు అందించిన ఆధారాల ఆధారంగా పోలీసులు సదరు గురూజీకి సంబంధించిన సమగ్ర వివరాలను సేకరిస్తున్నారు. వాట్సాప్ చాట్‌లు, కాల్ డేటాను విశ్లేషించి చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి రంగం సిద్ధం చేశారు.

### ఆధ్యాత్మికత పేరుతో మోసాలు...

భక్తి అనేది గుడ్డి నమ్మకం కాకూడదని, గురువుల ముసుగులో ఉన్న ఇలాంటి వ్యక్తుల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. సత్ప్రవర్తన నేర్పాల్సిన వారే ఇలాంటి అసాంఘిక పనులకు ఒడిగడితే చట్టం తీవ్రంగా పరిగణిస్తుందని హెచ్చరిస్తున్నారు. ఇలాంటి ఘటనలు సమాజంలో భక్తిపై ఉన్న నమ్మకాన్ని పూర్తిగా సడలించేలా చేస్తున్నాయి. కష్టాల్లో ఉన్నప్పుడు లభించే ఓదార్పును స్వార్థానికి వాడుకునే ఇటువంటి గురూజీల అసలు రంగు బయటపడాల్సిందే. మన సమస్యలకు పరిష్కారం బయటి వ్యక్తుల చేతుల్లో ఉండదని, వివేకంతో ఆలోచించకపోతే కుటుంబాలు ఎలా కూలిపోతాయో ఈ ఘటనే ఉదాహరణ. బాధితుడికి న్యాయం జరగాలని, దోషులకు తగిన శిక్ష పడాలని అంతా కోరుకుంటున్నారు.

### 100 వాట్సాప్ చాట్‌ల స్క్రీన్‌షాట్...

బాధితుడు పోలీసు స్టేషన్ పరిధిలో ఇచ్చిన ఫిర్యాదులో దాదాపు 100కి పైగా వాట్సాప్ చాట్‌ల స్క్రీన్‌షాట్‌లు, 50కి పైగా కాల్ రికార్డింగ్‌ల ప్రూఫ్‌లను ఆధారాలుగా సమర్పించారు. గడచిన 6 నెలలుగా ఈ వ్యవహారం గుట్టు చప్పుడు కాకుండా సాగినట్లు పోలీసులు ప్రాథమిక విచారణలో గుర్తించారు. చట్ట ప్రకారం బాధితురాలికి కౌన్సెలింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, సదరు గురూజీపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.